
# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023





**టన్ను చీనీ రూ.36 వేలు**
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 307 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



**టమాట కిలో రూ.22**
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.4.50, సరాసరి ధర రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.6°/ 12.9°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం ఉండగా.. మధ్యాహ్నం ఎండలు పెరిగాయి.

## న్యూస్‌రీల్

### కావ్యను కాపాడిన ఖాకీలు



హిందూపురం: కావ్యకు సర్దిచెబుతున్న పోలీసులు

**ధర్మవరం అర్బన్ / హిందూపురం:** భర్త వదిలేసి వెళ్లగా అప్పుల బాధ పడలేక...ఇద్దరు పిల్లలను పోషించలేక ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధం కాగా, పోలీసులు ఆమెను కాపాడారు. వివరాల్లోకి వెళితే...తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిర మండలానికి చెందిన కంసల కావ్య అలియాస్ విజయలక్ష్మికి తొమ్మిదేళ్ల కూతురు అప్పుతో పాటు పదకొండేళ్ల బన్ని సంతానం. ఆమె భర్త కొంతకాలం కిందట ప్రమాదంలో గాయపడి వీరిని వదిలేసి కర్ణాటక రాష్ట్రానికి వెళ్లిపోయాడు. గతంలో భర్త చేసిన అప్పులు, కుటుంబ పోషణకు కావ్య చేసిన అప్పులు రూ.లక్షలకు చేరాయి. రుణదాతలు ఒత్తిడి చేయడంతో దిక్కుతోచని కావ్య పిల్లలను తీసుకుని కర్ణాటక వెళ్లేందుకు రైలు ఎక్కింది. బుధవారం మధ్యాహ్నం ఇద్దరు పిల్లలతో కలిసి ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అనంతరం ఇద్దరు పిల్లలనూ రైల్వే ప్లాట్‌ఫారంపై కూర్చోబెట్టి మంచి మాటలు చెప్పింది. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్లింది. దీంతో ఆమె కుమారుడు బన్ని తన వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. వెంటనే స్పందించిన వన్‌టౌన్ కానిస్టేబుళ్లు రాజప్ప, ఉపేంద్ర ఆఘమేఘాల మీద రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైలు పట్టాలపై ఉన్న కావ్యను గుర్తించి కాపాడారు. అనంతరం ఆమెను, పిల్లలను స్టేషన్‌కు తీసుకువెళ్లి టిఫిన్ తినిపించారు. సమస్య తెలుసుకుని కౌన్సెలింగ్ పంపారు. ఆ తర్వాత బెంగళూరు వెళ్లే రైలు ఎక్కిన కావ్య హిందూపురం రైల్వే స్టేషన్ చేరుకుంది. అక్కడ ప్లాట్‌ఫాంపై పిల్లలను కూర్చోబెట్టి రైలుకింద పడేందుకు వెళ్లగా...కుమారుడు మళ్లీ డయల్ 100కు ఫోన్ చేశాడు. దీంతో హిందూపురం వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని కావ్యను కాపాడారు. ఆమెను సర్దిచెప్పి పోలీసులు రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ అప్పగించారు. రైల్వే ఎస్‌ఐ ఆమె పరిస్థితి తెలుసుకుని రుణదాతలతో ఫోన్‌లో మాట్లాడారు. మరికొంత సమయం ఇవ్వాలని సర్దిచెప్పాడు. అనంతరం కావ్యకు బంధువులకు సమాచారం ఇచ్చారు.

### రైల్వే డబ్లింగ్ పనుల పరిశీలన



మోటార్ ట్రాలీపై సౌత్ సెంట్రల్ జోన్ కమిషనర్ ప్రణ్‌జీవ్ సక్సేనా

**ధర్మవరం:** గుత్తి – ధర్మవరం రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు పనులను సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ కమిషనర్, రైల్వే సేఫ్టీ ఆఫీసర్ ప్రణ్‌జీవ్ సక్సేనా బుధవారం తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలకు ధర్మవరం నుంచి చిగిచెర్ల రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి మోటార్ ట్రాలీలో ప్రయాణిస్తూ మధ్యాహ్నం 2 గంటల వరకూ ధర్మవరం వరకు జరిగిన డబ్లింగ్ పనులను పరిశీలించారు. అక్కడక్కడా చిన్నపాటి సమస్యలను గుర్తించి వెంటనే సరిచేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ధర్మవరం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, సేఫ్టీ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ కేవీరెడ్డి, స్టేషన్ మేనేజర్ నరసింహ నాయుడు, ఆర్‌పీఎఫ్ సీఐ కుమార్, జీఆర్‌పీ సీఐ నాగరాజు పాల్గొన్నారు.





ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రుల స్థానం), ఎంవీ రామచంద్రారెడ్డి (ఉపాధ్యాయ), సానిపల్లి మంగమ్మ (స్థానిక సంస్థలు), చిత్రంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి, ప్రకాష్‌రెడ్డి

# చేతల్లో సామాజిక న్యాయం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు జగన్ ప్రాధాన్యత
- 18 ఎమ్మెల్సీల్లో బీసీలకే 11 స్థానాల కేటాయింపు
- సామాజిక న్యాయాన్ని ప్రజలు గమనిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్



కలెక్టరేట్‌కు వస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, మంగమ్మ, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి, ప్రకాష్‌రెడ్డి, సిద్దారెడ్డి

**అనంతపురం అర్బన్/సప్తగిరి సర్కిల్:** చట్టసభలు, రాజకీయాల్లో సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. అనంతపురం స్థానిక సంస్థలు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సానిపల్లి మంగమ్మ, వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు బుధవారం ఆయన బీ ఫారం అందజేశారు. అనంతరం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వద్ద నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆ తర్వాత మీడియా పాయింట్ వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ముఖ్యమంత్రి జగన్ సమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టీడీపీకి బీసీలు పట్టుగొమ్మలని చెప్పే చంద్రబాబు ఏనాడూ ఆ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వలేదని ధ్వజమెత్తారు. సీఎం జగన్ బడుగులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిస్తున్నారని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం 18 ఎమ్మెల్సీల్లో 11 స్థానాలను బీసీలకు కేటాయించారని, ఇది దేశ చరిత్రలో తొలిసారని పేర్కొన్నారు. అన్ని వర్గాలకూ సమాన అవకాశాలు కల్పిస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు గమనిస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల భారీ ర్యాలీ**

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా బుధవారం అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తొలుత సంగమేశ్వర ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్‌లు కాపు రామచంద్రారెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ, పీవీ సిద్దారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, డాక్టర్ తిప్పేస్వామి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మహమ్మద్ ఇక్బాల్, కల్పలతారెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, నగర మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు శ్రీదేవి, గౌస్‌బేగ్, శ్రీనివాసులు, కేవీ రమణ, గోవిందు, శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థుల నామినేషన్**

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఆ పార్టీ అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ జిల్లాల అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బీకేపార్థసారథి, శ్రీనివాసరెడ్డి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఉన్నారు. పీడీఎఫ్ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా..ఐదో రోజు బుధవారం ఎమ్మెల్సీ స్థానాలకు 42 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 33 సెట్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 8 సెట్లు, స్థానిక సంస్థలకు ఒక సెట్టు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల స్థానాలకు 77 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు. ఈనెల 27 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు.



కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



నామినేషన్ కార్యక్రమానికి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, పెద్దారెడ్డి



టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



పీడీఎఫ్ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేస్తున్న కత్తినరసింహారెడ్డి



పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పోతుల నాగరాజు

## పోలీసులూ చట్టానికి లోబడే పనిచేయాలి



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్



సమీక్షలో పాల్గొన్న పోలీస్ అధికారులు

- కేసుల దర్యాప్తులో ఆధారాలు శాస్త్రీయంగా సేకరించాలి
- నేర సమీక్షలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశం

**పుట్టపర్తి అర్బన్:** చట్టం ఎవరికైనా ఒకటేనని, పోలీసులు అందుకు అతీతులు కాదని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ స్పష్టం చేశారు. నిందితుల అరెస్టు సమయంలో పోలీసులు చట్టానికి లోబడే నడుచుకోవాలన్నారు. హద్దుమీరితే పోలీసులైనా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. బుధవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో స్టేషన్ హౌస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష చేశారు. ఈ ఏడాది జరిగిన గ్రేవ్ కేసులు, అంతకుముందు పెండింగ్‌లో ఉన్న యూఐ గ్రేవ్ కేసులు, ఫ్యాక్షన్ సంబంధిత కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సర్కిళ్ల వారీగా సమీక్షించారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. నేర పరిశోధనలో అధికారుల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కీలక కేసుల దర్యాప్తులో ఆధారాలు చాలా కీలకమని, అందువల్ల ఘటనా స్థలంలో శాస్త్రీయ పద్ధతుల్లో ఆధారాలను సేకరించాలన్నారు. వాటి ద్వారా మాత్రమే నిందితులకు శిక్షలు పడేలా చేయగలమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, గుట్కా, మద్యం అక్రమ విక్రయాలు, ఇసుక దందా వంటివి కట్టడి చేయాలన్నారు. 'స్పందన' పిటీషనర్లతో మర్యాదగా వ్యవహరించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫ్యాక్షనిస్టుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ అధికారులతో కలిసి ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందితో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ డీఎస్పీలు యశ్వంత్, భవ్యకిషోర్, హుస్సేన్‌పీరా, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

**సాక్షి, పుట్టపర్తి:** వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు నూతన జిల్లా అధ్యక్షులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కొత్తగా ఎంపికైన అధ్యక్షులు పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

| అనుబంధ విభాగం | జిల్లా అధ్యక్షుడి పేరు | నియోజకవర్గం |
|---|---|---|
| యువజన విభాగం | బీఎన్ లోకేశ్ | హిందూపురం |
| మహిళా విభాగం | సాకే ఉషారాణి | రాప్తాడు |
| రైతు విభాగం | పి.శంకర్‌రెడ్డి | పెనుకొండ |
| బీసీ సెల్ | పొరకాల రమణ | పుట్టపర్తి |
| ఎస్టీ సెల్ | తిరుపాల్‌నాయక్ | పుట్టపర్తి |
| మైనార్టీ సెల్ | బీఎస్ తబ్రేజ్ | కదిరి |
| వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ | సోమశేఖర్‌రెడ్డి | పుట్టపర్తి |
| వాణిజ్య విభాగం | కేతా శ్రీకాంత్ | హిందూపురం |
| కల్చరల్ విభాగం | జె.మారుతిప్రసాద్‌రెడ్డి | పెనుకొండ |
| వైఎస్సార్ సేవాదళ్ | ఎన్.వేణుగోపాల్ | పెనుకొండ |
| పబ్లిసిటీ విభాగం | జి.వెంకటరంగారెడ్డి | మడకశిర |
| పంచాయతీరాజ్ విభాగం | హనుమంతరెడ్డి | మడకశిర |
| గ్రీవెన్స్ సెల్ | ఎం.జగన్‌మోహన్‌రెడ్డి | పుట్టపర్తి |
| ఎస్సీ సెల్ | ఎం.నరసింహులు | కదిరి |
| చేనేత విభాగం | జింకా కంబగిరి | ధర్మవరం |
| విద్యార్థి విభాగం | పురుషోత్తం రాయల్ | ధర్మవరం |
| డాక్టర్స్ విభాగం | టి.సూర్యనారాయణరెడ్డి | ధర్మవరం |
| క్రిస్టియన్ మైనార్టీ విభాగం | పి.నారాయణస్వామి | మడకశిర |

## ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి : కలెక్టర్



**పుట్టపర్తి అర్బన్:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా రోజూ నిర్ణీత సమయంలోపు ముఖ ఆధారిత హాజరు వేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) యాప్ అమలుపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా అనేక కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు విధానం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారానే అటెండెన్స్ వేయాలని, లేకపోతే జీత భత్యాలు ఆగిపోతాయన్నారు. రామగిరి, హిందూపురం, మడకశిర, రొద్దం, బత్తలపల్లి, సీకేపల్లి, లేపాక్షి, గుడిబండ, కనగానపల్లి, బుక్కపట్నం, కదిరి, ముదిగుబ్బ, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో ఎక్కువ శాతం అధికారులు, సిబ్బంది యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేదని, దీనికి కారణాలు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా కొంతమంది తహసీల్దార్లు తమ కార్యాలయాల్లో సెల్ నెట్‌వర్క్ పని చేయడం లేదని, స్మార్ట్ ఫోన్లు లేవని చెప్పగా... కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రంలోపు ప్రతి ఒక్కరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ కావాలన్నారు.

# న్యాయవాదికి వరం లా నేస్తం

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య
- జిల్లాలో 21 మందికి రూ.15.35 లక్షల లబ్ధి

**పుట్టపర్తి అర్బన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 'వైఎస్సార్ లా నేస్తం' యువ న్యాయవాదులకు వరంగా మారిందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య అన్నారు. పథకానికి అర్హులైన న్యాయవాదులు ప్రాక్టీస్ ప్రారంభించాక మూడేళ్ల పాటు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. 'వైఎస్సార్ లా నేస్తం' వరుసగా నాలుగో ఏడాదీ ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లాలోని లబ్ధిదారులకు అధికారులు మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ... యువ న్యాయవాదులు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని వృత్తిలో రాణించాలన్నారు. అలాగే పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటోందని ఈ క్రమంలోనే 'వైఎస్సార్ లా నేస్తం'తో పాటు రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ అందించిందన్నారు. అనంతరం 'వైఎస్సార్ లా నేస్తం' లబ్ధిదారులకు రూ.15.35 లక్షల చెక్కును అందజేశారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే 'వైఎస్సార్ లా నేస్తం' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ శివారెడ్డి, వివిధ కోర్టుల యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

### ప్రోత్సాహం మరువలేనిది



నేను ప్రాక్టీస్ మొదలు పెట్టిన తొలి ఏడాదే 'వైఎస్సార్ లా నేస్తం' అందుతోంది. గతంలో ఏ ప్రభుత్వం న్యాయవాదుల గురించి పట్టించుకోలేదు. యువ న్యాయవాదులకు సీఎం జగన్ ఇస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. ప్రతి నెలా ప్రభుత్వం అందించే రూ. 5 వేలు నిజంగా నాకెంతో విలువైనవి. పేద కుటుంబాల్లోని యువ న్యాయవాదులు నిలదొక్కుకోవడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

– మౌనిక, పెనుకొండ

### కార్పస్ ఫండ్‌తో ఎందరికో మేలు



ప్రభుత్వం న్యాయవాదుల కోసం కార్పస్ ఫండ్ కేటాయించడం అభినందనీయం. అర్హులైన న్యాయవాదులకు రుణ సౌకర్యం, ఆపరేషన్లు, ఇన్సూరెన్స్ వంటి అత్యవసరాలకు కార్పస్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. కోవిడ్ సమయంలోనూ న్యాయవాదుల అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది.

– కిరణ్‌కుమార్‌రెడ్డి, పెనుకొండ



న్యాయవాదులకు మెగా చెక్కు అందజేస్తున్న దృశ్యం

### న్యాయ విద్యార్థులకు భరోసా



న్యాయ విద్య అభ్యసించే విద్యార్థులకు 'వైఎస్సార్ లా నేస్తం' భరోసాను ఇస్తుంది. పేదింటి పిల్లలు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకునేందుకు మూడేళ్ల పాటు ఒక్కో న్యాయవాదికి సుమారు రూ.1.80 లక్షలు అందజేయడం సంతోషించదగ్గ విషయం. పేదలకు కచ్చితంగా అతి తక్కువ ఫీజులతోనే న్యాయ సేవలందించి ప్రభుత్వ రుణం తీర్చుకుంటా. – షేక్ ఆదిల్, కదిరి

# వైభవం... సిద్ధేశ్వరుడి చిన్నరథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

హేమావతి(అమరాపురం): మండలంలోని హేమావతిలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి చిన్నరథోత్సవం వైభవంగా సాగింది. వేకువజామునే ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజల అనంతరం రథంపై అధిష్టింపజేశారు. శివ...శివ, సిద్ధేశ్వరస్వామి మహారాజ్‌కు జై అంటూ వేలాది భక్తులు నినదిస్తూ రథాన్ని ముందుకు లాగారు. రాత్రి ముత్యాల పల్లకీలో ఆదిదంపతులను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలను ఆలయ పాలక మండలి చైర్మన్ మంజునాథ్, ఈఓ నాగేంద్రప్రసాదరావు, సర్పంచ్ తిప్పేస్వామి తదితరులు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సురేష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

### నేడు బ్రహ్మరథోత్సవం

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఓ నాగేంద్రప్రసాద్‌రావు బుధవారం తెలిపారు.

## ఐపీటీవీ సేవలు ప్రారంభం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిధిలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు సంస్థ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని ఆ శాఖ జనరల్ మేనేజర్ ఎస్.ముజీబ్ పాషా పేర్కొన్నారు. ఉల్కా టీవీ సహకారంతో బీఎస్ఎన్ఎల్ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చిన ఐపీటీవీ (ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్) సేవలను బుధవారం అనంతపురంలోని వేమన టెలిఫోన్ భవన్‌లో ఆయన లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడారు. ఐపీటీవీ సేవలను పొందాలంటే కచ్చితంగా సెటప్ బాక్స్ కొనుగోలు చేయాలన్నారు. సెటప్ బాక్స్‌ను ఇంట్లో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చునని, దీని ద్వారా వాయిస్ కాల్స్, ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు టీవీ ప్రోగ్రాంలనూ వీక్షించవచ్చునన్నారు. ఎస్‌డీ బేసిక్ ప్లాన్ ధర రూ.229 కాగా, హెచ్‌డీ ప్యాక్‌కు రూ.279 అదనపు అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## డ్రైవర్ ఆత్మహత్య

ములకలచెరువు: అప్పుల బాధతో ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం దామవాండ్లపల్లికి చెందిన అశోక్ (34) వైఎస్సార్ జిల్లా ములకలచెరువులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నాలుగేళ్లుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య సుమిత్ర, ఇద్దరు కుమార్తెలున్నారు. అవసరాలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఈ క్రమంలో శివరాత్రి పండుగకు పిల్లలను పిలుచుకుని భార్య పుట్టింటికి వెళ్లింది. అద్దె ఇంట్లో ఒంటరిగా ఉన్న అశోక్ బుధవారం తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని పక్కంటివారు గమనించి సమాచారం అందించడంతో భార్య సుమిత్ర, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సోలార్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముదిగుబ్బ: మండలంలోని నాగారెడ్డిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌లో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్లాంట్ సమీపంలో ఎండుగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చుట్టుముట్టాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది. ఘటనలో ప్లాంట్‌కు సంబంధించిన ఆస్తి కాలిబూడిదైనట్లు సిబ్బంది తెలిపారు.

## విద్యార్థి అదృశ్యం


నాగార్జున

రొద్దం: మండలంలోని ఆర్.లోచెర్ల గ్రామానికి చెందిన నరసింహప్ప కుమారుడు బి.నాగార్జున కనిపించకుండా పోయాడు. పదో తరగతి చదువుతున్న బాలుడు ఈ నెల 21న ఉదయం 7 గంటలకు రొద్దంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకోలేదు. చుట్టుపక్కల గాలించినా కుమారుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 94409 01902కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## పోతలయ్య జాతర ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పోతలయ్యస్వామి మూలవిరాట్

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో పోతలయ్య స్వామి జాతర బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు రామగిరి మండలంలోని స్వామి కాపులు యలవగంపతో ఊరేగింపుగా స్వామి ఆభరణాలు, పూలు తీసుకువచ్చి మూలవిరాట్‌ను అలంకరించి, పూజలు చేశారు. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయంలో సమారాధన నిర్వహించారు. గురువారం పోతలయ్య, చెన్నకేశవస్వామికి జ్యోతులు, బోనాలు సమర్పించనున్నారు. కార్యక్రమాలు ఆలయ పాలక మండలి చైర్మన్ రామలింగారెడ్డి పర్యవేక్షించారు.

## హత్య కేసులో నిందితుల అరెస్ట్

సోమందేపల్లి: ఈ నెల 17న చోటు చేసుకున్న కుమ్మర మోపూరి (32) హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం సోమందేపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. కొంత కాలంగా పుట్టపర్తి మండలం కొట్లపల్లి గ్రామానికి చెందిన రామాంజినేయులుతో మోపూరి భార్య అర్పిత వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో తమకు అడ్డుగా ఉన్నాడని భావించి రామాంజనేయులు, రాఘవేంద్రతో కలసి మోపూరిని అర్పిత హతమార్చింది. ఈ కేసులో అర్పిత ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో నిఘా ఉంచిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను బుధవారం సాయంత్రం చాకర్లపల్లి సమీపంలోని ఇబ్రహీం బాబా ఆశ్రమం వద్ద అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## పీఏసీఎస్ గోదాముల పరిశీలన

కొత్తచెరువు/గోరంట్ల: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియగానే బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచేందుకు కొత్తచెరువు, గోరంట్ల మండలాల్లోని ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్) గోదాములను జాయింట్ కలెక్టర్ చేతన్ బుధవారం పరిశీలించారు. కొత్తచెరువులోని గోదాముతో పాటు గోరంట్ల మండలం పాలసముద్రంలోని గోడౌన్‌లోని పరిస్థితులను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆర్డీఓ భాగ్యరేఖ, కొత్తచెరువు తహసీల్దార్ రామాంజనేయరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసులు, గోరంట్ల తహసీల్దార్ రంగనాయకులు, వివిధ శాఖల అధికారులున్నారు.

## అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్



నిందితులు సురేష్, అశోక్

బాగేపల్లి: కర్ణాటకలోని బాగేపల్లితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న ఇద్దరు దొంగలు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని శ్రీసత్యసాయి జిల్లా అమడగూరుకు చెందిన సురేష్, గోరంట్లకు చెందిన అశోక్‌గా బాగేపల్లి పోలీసులు గుర్తించారు. వీరి నుంచి రూ.3 లక్షల విలువైన 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 3న బాగేపల్లి బస్టాండ్ వద్ద పార్క్ చేసిన బైక్‌ను వీరు అపహరించుకెళ్లారు. దీనిపై బైక్ యజమాని గుడిబండ తాలూకా సోమేశ్వర గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బాగేపల్లి పోలీసులు గాలింపు చేపట్టి పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేశారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

పరిగి: నీటి కుంటలో ప్రమాదవశాత్తు గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం వెలికి తీశారు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం కొడిగెనహళ్లి బీసీ కాలనీలో నివాసముంటున్న ఉగ్ర నరసింహప్ప (65)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్ల క్రితమే భార్య మృతి చెందింది. ఆర్థిక ఇబ్బందులు వెన్నాడుతుండడంతో చేపలు వేటతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత మంగళవారం గ్రామ శివారులోని ఓ కుంట వద్దకు చేపల వేటకు వెళ్లిన నరసింహప్ప.. ప్రమాదవశాత్తు కాలు జారి లోతైన ప్రాంతంలో పడి నీట మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం పోలీసులు, స్థానికుల సాయంతో మరోసారి గాలింపు చేపట్టి నరసింహప్ప మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

# నైపుణ్యాభివృద్ధితోనే విస్తృత ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పెనుకొండ రూరల్: నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకున్నప్పుడే విస్తృత ఉపాధి అవకాశాలు దక్కుతాయని నిరుద్యోగులకు కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. పెనుకొండ మండలం అమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని గుట్టూరు వద్ద ఉన్న కియా పరిశ్రమ ట్రైనింగ్ సెంటర్‌లో సీసీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా నిరుద్యోగ యువతకు ఇస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కియా ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. సరైన పద్ధతిలో శిక్షణ పొందితే ప్రపంచ నలుమూలల్లో ఎక్కడైనా పని దొరుకుతుందన్నారు. జిల్లాలో నూతన పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు కానున్న నేపథ్యంలో నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలన్నారు. కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. శిబిరంలో మూడు నెలలపాటు ఆటో సర్వీస్ టెక్నీషియన్ ప్రోగ్రాం కింద వంద మందికి నాలుగు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రూ.55 లక్షలను కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తీక్, సంభవ్ ఫౌండేషన్ ప్రతినిధి గాయత్రి, తహసీల్దార్ స్వర్ణలత పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి

మడకశిర: వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఏ స్థాయిలోనూ సహించబోమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాల వారికి మరింత మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని పీహెచ్‌సీల వైద్యులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.... వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ముఖ్యంగా వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ ప్రబలకుండా డాక్టర్లు, సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు విస్తృతంగా వేయాలన్నారు. పీహెచ్‌సీల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తదితరులు పాల్గొన్నారు.